శబ్బరులా సాగిన చైతన్యం తెగుతుంది
ఉన్మాదంలో
తోచని రోజుల రోడ్డుకి గండి ప్రమాదంలో
పసితనంలోంచి పసితనంలోకి
'అంగం గలితం, ఫలితం ముండం
దశన విహీనం జాతం తుండం'
చీకటి గర్భాశయంలోంచి, చీకటి గర్భాశయం
లోకి
'పునరపి జననం, పునరపి మరణం'
పిచ్చాసుపత్రి ద్వారాలు తెరిచారు
బద్దలు కొట్టారు అవ్యక్తపు ఆనకట్టలు
వరదలు పొరలుతున్నాయ్, పొంగింది మురుగుటేరు
ఏమిటి చేశావు మానవుడా?
'కృతం స్మర! గతం స్మర! కృతం స్మర!'
అనంత సాగరంలో తుపాను, చిల్లిపడవ,
కాళరాత్రి జీవితయాత్ర ప్రొద్దు పొడవదు
కూచునేందుకు వీలులేదు
ఒంటరిగా ఒంటరిగా
మంటల్లో, మంటల్లో
పయనిస్తున్నాడు మానవుడు తెలియని దిక్కుకేసి.

# విశ్రాంతిలోని సుఖం

(కథానిక)

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

గడియారం అయిదున్నర చూపుతూనే ఉంది; ఎండకాంతి అంతా తగ్గిపోయి సంజచాయలు ఆక్రమిస్తూనే ఉన్నాయ్...గుమాస్తా వెంకటచలం వేళ్లు టైప్‌రైటర్ కీబోర్డుమీద లయ వేస్తూ నాట్యంచెయ్యడం మటుకు మానలేదు.

ప్రక్కనున్న హైస్కూలు ఆటస్థలంలో కుర్రవాళ్ళంతా వివిధ రకాలుగా ఆడుకుంటున్నారు సంతోషంగా. వాళ్లలో పదిపన్నెండేళ్లవాళ్లూ ఉన్నారు; నూనూగుమీసాల యువకులూ ఉన్నారు. అందరూ కలిసి ఆనందంగా ఆడుకుంటున్నారు. రోజల్లా క్లాసులో పని చేశాక వాళ్ళకీ ఆటలెంత అవసరం! వాళ్ళందరి ముఖాలూ వికసించి ఎంతగా కలకలలాడుతున్నై ఆటల్లో!

యాంత్రికంగా చేతులు పని చేస్తున్నై యంత్రంమీద. చలం మెదడుమటుకు మరోచోట పనిచేస్తూంది. మానవుడికి కావలసిన విశ్రాంతి - భగవంతుడిచ్చినా - తాను పొందలేకున్నాడు! దేవుడు వరంయిచ్చినా పూజారి యివ్వడట. అలాగ కూలివాడు మొదలు లక్షాధికారివరకూ సంపాదించే డబ్బుకోసం తాను ఆత్మనే అమ్ముకోవలసి వచ్చింది. దీపాలుపెట్టే వేళదాకా పనిచెయ్యాలి ఎనిమిదినించి ఆఫీసులో. ప్రతిఫలం ప్రభుత్వం తనకి రోజుకి రెండున్నర ఇస్తుంది. తన ఆత్మసుఖం విలువ-రెండున్నర!

తన చేతిలో యంత్రాలూ, భాగాలూ ఎన్నో అరిగిపోయ్యాయ్. అన్నీ కొత్తవి కొని వేశారు పాతవి వదలి. కాని తను-తన చేతివ్రేళ్లు ఎంత అరగి మొద్దుబారినా...

చలానికి నవ్వు వచ్చింది తన ఆలోచనకి. కొత్తవ్రేళ్లు కావాలా? గబగబ కాగితం పూర్తి చేసి పది సంవత్సరాల అనుభవపు నేర్పుతో అన్నికాగితాలూ దొంతరపెట్టి ఆఫీసర్ దగ్గరకి పట్టికెళ్లాడు.

ఆఫీసర్ ఎగాదిగా చూసి అన్నాడు: “ఇంకొక్కటి ఉందోయ్. కొట్టేస్తే వెళ్ళిపోదూగాని. చాలా అర్జంటు. జాగ్రత్తగా కొట్టేయ్.”

చలం సీరసంగా యంత్రంవైపు నడిచాడు. ఎదురుగా రోడ్డుమీద పెద్దశెట్టి వెళ్ళిపోతున్నాడు ఠీవిగా అనుయాయులతో సహా. అతనేం చదివాడని? ఏం ఉద్యోగంమట్టుకు చేస్తున్నాడు? అతనికి డబ్బుకి లోటులేదు. విశ్రాంతికి లోటు లేదు. తనమీద భగవంతుడికికూడా కోపమేమో?

గడియారం ఆరు కొట్టేసరికి పూర్తిచేసి ఇంటివైపు నడిచాడు చలం ఏదో విచారంగా.

అతనికీరకపు ఆలోచన క్రొత్తగానే వచ్చింది. జన్మతః భగవంతుడిచ్చే ప్రాథమిక హక్కుల్ని,

మానవుడి జీవనసుఖావసరాలని మరోమానవుడు ఎంత నిర్దయగా అణిచి నశింపజేస్తున్నాడు !

ఆకాశం కారు మబ్బులతో ఆవరింపబడింది. గర్జనలతో మేఘుడు భూమిని జలమయం చేసే లాగ భయపెడుతున్నాడు. ఒక్క నిమిషంలో వాతావరణం మారిపోయింది. మెరుపులు, చీకటి.

చలం మనస్సింకా భీకర మేఘాలయమై ఉంది. అతనికి డబ్బుమీదా, టైపు మెషీన్ మీదా, భగవంతుడిమీదా చాలా కోపం వచ్చింది. పదేపదే అతను తనని ప్రశ్నించుకున్నాడు. ఒక మానవుడి హక్కులని కాదనడానికి ఇంకో మానవుడికి ఏం హక్కు ఉంది?

డబ్బు ప్రతితీ. మానవుడూ దానికి దాసుడూ యజమానీ. అది ఎవరి దగ్గర హెచ్చుగా ఉంటే వాళ్లు జగత్తును వశంచేసుకుని ఏలుతారు. వారి ఆజ్ఞలు శిరసా వహించబడతాయ్. వారు ఇతరుల విశ్రాంతిని నశింపజెయ్యవచ్చు - మానవుడు ఎంత మూర్ఖుడూ, దుర్మార్గుడూ అయిపోయాడు!

చిన్న చినుకులు పడసాగాయ్. చలం ఇల్లింకా నాలుగు ఫర్లాంగుల దూరమైనా ఉంది - అతను ఆలోచనా ప్రవాహంతో ముందుకే సాగుతున్నాడు. ఆ చిన్న చినుకులు అతని అవధానాన్ని ఆకర్షించలేకపోయాయ్.

గాలులూ, మెరుపులూ తీవ్రతరం కాజొచ్చాయ్. చినుకులు పెద్దవయాయ్. క్రమంగా అవి చలం శరీరాన్ని తడిపివేశేదాకా అతనికి ధ్యాసే లేదు. స్వతహాగా ఇతరుల జోలి అక్కరలేనివాడవడంవల్లా, ఆ వూరు వచ్చి నాలుగు నెలలైనా కాకపోవడంవల్లా అతను వర్షంనించి తప్పించుకోడానికి ఏపంచలో దూరాలో తెలియలేదు. అదీ కాక ఇల్లు ఇంక ఫర్లాంగుకన్న లేదు. శారద తనకోసం ఎదురు చూస్తూంటుంది మధ్యాహ్నం ఒంటిగంట నించీ. హరికూడా తనకోసం ఆత్రుతగా ఎదురుచూస్తూంటాడు. ఈ వేళ తాను వాడికి మూడో తరగతి వాచకం తెచ్చిపెడతానని చెప్పాడుకూడా. వాణ్ణికూడా ఆగపెట్టి తప్పవలసి వచ్చింది. తనకి విశ్రాంతి ఏదీ ఇవన్నీ చూడడానికి?— ముందుకు సాగాడు.

ఎదురుగాలికి వెనక్కిపోతున్నట్టు బాధపడుతూ పూర్తిగా బట్టలు మార్చుకుని భోజనం చేశాడు ఎనిమిదికి.

* * *

ఉదయం చలం మంచం వదిలేసరికి అతను ఏదోలాగ ఫీలయ్యాడు. ఒళ్లంతా నొప్పి. బద్ధకం.

శారద అంది. "ఒళ్లుకూడా వెచ్చగా ఉంది. ముఖంచాలా బరువుగా కనిపిస్తూంది కూడా. ఈ పూటికి సెలవుపెట్టేయండి".

కురిసి వెలిసిన తరవాత ఉదయాన్నే వచ్చిన గాలి. కాఫీ తాగుతూంటే శారద అలాగ అంది. సెలవు! సిక్ తప్పిస్తే ఆఫీసరు ఏ సెలవూ మంజూరు చెయ్యడు. టైపిస్టు రాకపోతే ఎలాగ? ఒక రోజు సెలవు ఉన్నా మర్నాడు కాగితాలు కట్టలుగా పడి సిద్ధపడతై.

కాగితం తీసుకొని సిక్ లీవుకే వ్రాశాడు ఆ జ్వరంకూడా బాగా వచ్చినట్టుంది. చలి మొదలు పెట్టింది.

కాగితం ఆఫీసుకి పంపి పడుకున్నాడు. చలి వణికిస్తూంది గుండెలనికూడా. రగ్గుకప్పుకుని చలితోనూ, తలనొప్పితోనూకూడా బాధపడుతూన్నా ఎందుకో చలానికి కష్టం అనిపించలేదు- ఆఫీసులో మెషీన్ముందుకూర్చుని పనిచేసేకన్న ఇదేనయంలాగ...

మధ్యాహ్నం పన్నెండయేసరికి కాస్త జ్వరం తగ్గింది. ఇంటిచుట్టూ పొలాల్లోనూ అక్కడక్కడ నీళ్లు నిలచివున్నాయ్. నాతితీక్ష్ణంగా వెలుగుతూ సూర్యుడు వింతప్రభలని వ్యక్తంచేస్తున్నాడు. చలం మనస్సుని ఏదో అవ్యక్తమైన ఆనందం నింపేసింది. విశ్రాంతిలో ఎంతసౌఖ్యం! నిలచిన వాననీటిలో చిన్నచిన్న మొక్కలు తలలు



పైకెత్తి సూర్యుణ్ణి చూస్తూ ఎంతహాయిగా, నిర్వికారంగా జీవితం గడుపుతున్నై!

గంటా రెండుగంటలూ విరామంతో వస్తూనే ఉంది జ్వరం చలానికి. శారద యథాశక్తి పరిచర్యా, వైద్యమూ చేస్తూనే ఉంది. కాని ఆమెకి ఆశ్చర్యం కలుగజేసింది చలం ముఖంలోని నిర్వికారసహితశాంతి.

ఎవ్వరే మందు చెప్పినా ఓపికగా చేస్తూనే ఉంది శారద. అసలు వైద్యం చెప్పడం సలహాలు చెప్పడంలాగ చాలా సులభమైన పని. శారదకి తెలుసు ఆ వైద్యాల్లో దేనికీ పటుత్వం లేదని. కాని డాక్టర్ని పిలవడం ప్రమాదపు తీవ్రతని గురుత్వంచేస్తుందని గృహవైద్యాలతోనే సాగించిందొక వారం.

స్థితప్రజ్ఞుడిలాగ ఏమందు పోసినా తాగుతూనే ఉన్నాడు చలం. అతనికి ఈ తతంగం అంతా బాధాకరంగా లేదుగాని విశ్రాంతి కావాలి అని కోరుకున్నప్పుడు దైహిక విశ్రాంతిని కోల్పోవడం కష్టమనిపించింది. ఆ జ్వరం అతని కంటె శారదని ఎక్కువ కలతపెట్టింది.

జ్వరం తిరుగు ముఖంపట్టలేదు రెండో వారం, మూడో వారమూ కూడా. తీవ్రతరం అయిపోతూంది రోజురోజుకీ. డాక్టర్ని పిలవక తప్పలేదు. శారద గాభరా పడసాగింది.

డాక్టర్ ట్రీట్‌మెంట్ మొదలుపెట్టాక ఇంజక్షన్లూ, రంగునీళ్లూ త్రాగడం. తప్పలేదు అనుదినమూ. దీనికితోడు బంధువులూ, స్నేహితులూ పరామర్శకి రాసాగారు!

చలం మనస్సుకి పని ఎక్కువైపోయింది. వచ్చిన స్నేహితులందరినీ ఆదరించి మాట్లాడి పంపాలి. తనమీద అభిమానంకొద్దీ వచ్చినవాళ్లని పలకరించకుండా, ఆదరించకుండా ఎలాగు పంపగలడు? ఇంక చుట్టాలు. వారందరూ ఏడుపులొకటి తనని చూడగానే. గుండె నిబ్బరం గల శారద కూడా బిక్కచచ్చిపోతూంది వాళ్ళ హడావుడితో ... వాళ్లందరికీ భోజనాదులు చూడడం ఒక బాధ- ఇల్లు క్రిక్కిరిసిపోయింది.

చలం మెదడు ఈ ఆలోచనలతో నిండిపోయి మరీ బాధపడసాగింది. అతను అనుకున్నాడు కూడా: ఈ రకపు జీవితంకన్న ఆఫీసులో మెషిన్ ముందు బ్రతుకే నయమేమోనని- అతను చాలా ఖిన్నుడయాడు.

వైద్యమందులూ ఇంజక్షన్లూ తనకెలాగ పని చేస్తాయ్? తనకి కావలసిన మందు విశ్రాంతి. ఇతరులతో ప్రమేయంలేని విశ్రాంతి.

* * *

ఈదరగాలి ఒక్కసారిగా వీచింది. చలం గదితెర అతని మంచందాకా ఎగిరింది. డాక్టర్ అతని నాడిని సంశయాస్పద దృక్కులతో పరీక్షిస్తూనే ఉన్నాడు. ఒక్కసారిగా చేతిని క్రింద పెట్టి గద్గదికంగా అన్నాడు- "మంచం పైన వెయ్యండి."

* * *

కాష్ఠంలో కాల్తూందో శవం.

అంతులేని కష్టాలతో అయిపోయిన జీవితపు గుర్తుగా కాష్ఠంలో కాల్తూందో శవం.

ఆకాశానికి అంటే రోదన ధ్వనులకి అందకుండా పొగగాపోతూ అచ్చపు విశ్రాంతిని అనుభవించడానికి మంటలలో మాడుతూ, కాష్ఠంలో కాల్తూందో శవం.

---

దేశంలో అరాచక పరిస్థితులు ఏర్పడితేగాని రాచకీయాధికారం కమ్యూనిస్టుల పరం కాదు.

ప్రజలు కూటికీ, గుడ్డకు అలమటిస్తేగాని అరాచక చర్యలకు దిగరు. కాబట్టి పంటకుప్పల్నీ, గడ్డివాముల్నీ తగలెడుతున్నారు.

అయినా ప్రజలు ఏది ఎలా తగలడితే మనకేం అని ఊరుకుంటున్నారు.

ఈ వైరాగ్యం శ్మశాన వైరాగ్యం కాకపోతే ప్రమాదం ఉంది. కాబట్టే ఎక్కడికక్కడ శ్మశానాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఈ రీతివిధంగా నిర్మాణం చేస్తుంటే అల్లూరి సత్యనారాయణగారు ఇది నిర్మూలనమని ప్రభుత్వ నిర్మాణాత్మక కార్యక్రమానికి అడ్డుతగుల్తున్నదనీ అంటున్నారు.

ఏది నిర్మాణమో, ఏవరిది నిర్మూలనమో గాని ప్రజలు మాత్రం ఈ రెంటి మధ్యాపడి నిర్వాణం పొందుతున్నారు—ఆంధ్రపత్రిక